క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన


అన్నప్రాసన నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని నాలుగో అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ తిప్పర్తి రాధా ఆధ్వర్యంలో శుక్రవారం అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరు నెలలు నిండే వరకు చంటి పిల్లలకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. 7వ నెల నుంచి బాలామృతం తినిపించాలన్నారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు హసీనా, గర్భిణులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

దేవరకొండ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని దేవరకొండ మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య కోరారు. శుక్రవారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్వచ్ఛ దీపావళి.. శుభ దీపావళి' కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా దీపావళి పర్వదినం సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన దుకాణాల వద్ద ఆయన ప్లకార్డులు ప్రదర్శించి మాట్లాడారు. దీపావళి పండుగను పురస్కరించుకొని మట్టి పాత్రల్లోనే దీపాలు వెలిగించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు జగమంతు, జాఫర్‌అలీ, సక్రునాయక్, మెప్మా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా వెంకట్‌రెడ్డి



వెంకట్‌రెడ్డికి నియామక పత్రం అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

మాడుగులపల్లి : భారతీయ జనతా పార్టీ నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షుడిగా మాడుగులపల్లి మండలం గురప్పగూడెం గ్రామానికి చెందిన పల్నాటి వెంకట్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి జిల్లా కేంద్రంలో వెంకట్‌రెడ్డికి నియామక పత్రం అంజేశారు. నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేస్తూ గ్రామస్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలని ఆయనకు సూచించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా క్యాడర్‌ను సమాయత్తం చేయాలన్నారు. తనకు జిల్లా ఉపాధ్యక్షుడిగా అవకాశం ఇచ్చిన పార్టీ అధిష్టానానికి ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

వేలం పాట వాయిదా

కనగల్ : దర్వేశిపురం శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవస్థానం వద్ద శుక్రవారం జరగాల్సిన బహిరంగ వేలం పాట వాయిదా వేసినట్లు కార్యనిర్వాహణ అధికారి జల్లేపల్లి జయరామయ్య, చైర్మన్ అల్లుబెల్లి నర్సింహారెడ్డి తెలిపారు. వేలం పాటకు డిపాజిట్ చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో తిరిగి ఈ నెల 18న వేలం పాట నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

టీఎల్ కాంతారావుకు నివాళి


కాంతారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్ : తెలంగాణ ప్రాంతానికి చెందిన తొలితరం హీరో టీఎల్ కాంతారావు శత జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి శుక్రవారం నల్లగొండలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో నల్లగొండ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి పున్న అంజయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం గర్వించదగిన కథానాయకుడు టీఎల్ కాంతారావు అని కొనియాడారు. కాంతారావు శత జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గజవెల్లి సత్యం, దీకొండ వెంకటేశ్వర్లు, యంవి. విద్యాసాగర్‌రాజు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల స్వీకరణ

- చివరి రోజు 31మంది.. 79 సెట్ల నామినేషన్లు
- ఇప్పటి వరకు మిర్యాలగూడలో 45మంది, దేవరకొండ 18మంది, నాగార్జున సాగర్ లో 28మంది దాఖలు


నామినేషన్ దాఖలు చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి సతీమణి శ్యామల





నామినేషన్ దాఖలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి ప్రతిపాదకులు, బీజేపీ అభ్యర్థి లాలునాయక్, బీఎస్పీ అభ్యర్థి వెంకటేశ్ చౌహాన్, స్వతంత్ర అభ్యర్థి ఇస్లావత్ కిషన్

మిర్యాలగూడ : మిర్యాలగూడ అసెంబ్లీ స్థానానికి గాను శుక్రవారం 37 నామినేషన్లను దాఖలు చేశారు. ప్రధాన పార్టీలైన సీపీఎం నుంచి జూలకంటి రంగారెడ్డి, కాంగ్రెస్ బత్తుల లక్ష్మారెడ్డి, బీజేపీ నుంచి సాధినేని శ్రీనివాస్‌రావులతోపాటు కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా పగిడి రామలింగయ్యయాదవ్‌ల తోపాటు ఇండింపెండెంట్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఈనెల 3 నుంచి ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియలో భాగంగా చివరి రోజైన శుక్రవారం వరకు 45 మంది అభ్యర్థులు 79 సెట్లను దాఖలు చేసినట్లు ఆర్వో చెన్నయ్య తెలిపారు. నల్లమోతు భాస్కర్ (బీఆర్ఎస్), బత్తుల లక్ష్మారెడ్డి (కాంగ్రెస్), బత్తుల మాధవి (కాంగ్రెస్), సాధినేని శ్రీనివాస్‌రావు (బీజేపీ), జూలకంటి రంగారెడ్డి (సీపీఎం), డబ్బికార్ మల్లేష్ (సీపీఎం), బంటు రవి (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), కుకుడాల మనోజ్‌కుమార్ (విద్యార్థుల రాజకీయ పార్టీ), తరి ఎల్లయ్య (ధర్మసమాజ్ పార్టీ), పబ్బతి అశోక్‌రెడ్డి (జన శంఖారావం పార్టీ), వస్కుల గోపి(ఎంసీపీయూ), జాడి రాజు (బీఎస్పీ), పొనుగంటి రాఘవరాణి (జైస్వరాజ్‌పార్టీ), కర్నా రాజభార్గవ (యుగ తులసీ పార్టీ), సంక్రాంతి రాజశేఖర్ (అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్ పార్టీ), వజ్రగిరి పెద్ద అంజయ్య (బహుజన ముక్తి పార్టీ), కోల సైదులు (ప్రజావాణి పార్టీ), నందిపాటి జానయ్య (తెలంగాణ సకలజనుల పార్టీ), బొడ్డు వెంకటేశ్వర్లు (భారత చైతన్య పార్టీ), మంగదొడ్ల లింగయ్య (ఆల్ ఇండియా మహిళ ఎంపవర్‌మెంట్ పార్టీ), దేవులపల్లి కార్తీక్‌రాజు (నవరంగ్ కాంగ్రెస్ పార్టీ), మెరుగు సంపత్‌కుమార్ (సీపీఐఎంఎల్ రెడ్ స్టార్‌పార్టీ), బరపతి రాజశేఖర్‌రెడ్డి (ధర్మసమాజ్ పార్టీ), స్వతంత్ర అభ్యర్థులుగా పగిడి రామలింగయ్య, మల్లిడి వెంకటరామరెడ్డి, ధనావత్ ఉషానాయక్, బొలుసాని కృష్ణయ్య, తండు అంజయ్య, జిల్లా రవి, సందీప్, జవ్వాజి సత్యనారాయణ, ఎస్.అన్నపూర్ణ, మహేశ్వరం చిరంజీవి, పి.అనిల్, లావూరి సైదా, సయ్యద్ ఫారూఖ్, సపావత్ మధు, వడ్లమూడి మహీధర్, అశోక్‌కుమార్, రేపాల శ్రీనివాస్, మట్టపల్లి అంకులమ్మ, గుండ్రెడ్డి జనార్దన్‌రెడ్డి, చందాల సదానందం, బారెడ్డి లక్ష్మారెడ్డి, పగడాల ఎల్లయ్యలు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆర్‌ఓ పేర్కొన్నారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

నాగార్జునసాగర్ సాగర్‌లో ఎనిమిది మంది 27 సెట్లు..

నిడమనూరు: నాగార్జునసాగర్ అసెంబ్లీ స్థానానికి శుక్రవారం 8 మంది అబ్యర్థులు, 27 సెట్ల నామినేషన్లు వేసినట్లు ఎన్నికల అధికారి జే శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 3వ తేదీ నుంచి 10 వ తేదీ వరకు మొత్తం28 మంది 57 సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్లు తెలిపారు. శుక్రవారం నామినేషన్ వేసిన వారిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్ రెడ్డి (స్వతంత్ర), సీపీఐ (మార్కిస్ట్–లెనినిస్ట్) రెడ్ స్టార్ నుంచి జక్కుల నర్సింహ్మా, బీఎస్పీ నుంచి లోటోయిన వెంకటరమణ, పులిమాల కృష్ణారావు, జై మహాభారత్ పార్టీ నుంచి రుక్మిణి నాయక్, జన శంకారావం పార్టీ నుంచి అనిల్ రెడ్డి కనుకుంట్ల, నిరుద్యోగుల తరుపున గిరిబాబు కుక్కల (స్వతంత్ర), ఈసం నార్జున (స్వతంత్ర), దేవళ్ల సుబ్బారావు(స్వతంత్ర)లు నామినేషన్‌లు వేశారు.

దేవరకొండలో 13మంది 15 సెట్లు

దేవరకొండ : అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో మొదలైన నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం ముగిసింది.ఈనెల 3వ తేదీ నుంచి ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ 10వ తేది వరకు కొనసాగింది. చివరి రోజు సాగిన నామినేషన్ల ప్రక్రియలో భాగంగా ఆయా ప్రధాన పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర్య అభ్యర్థులు తమ ప్రతిపాదకులతో కలిసి ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ దాఖలు చేయడానికి చివరి రోజు కావడంతో ఆయా పార్టీల అభ్యర్థులు తమ మద్దతుదారులు, పార్టీ కార్యకర్తలతో భారీ ర్యాలీగా తరలివచ్చి నామినేషన్లు సమర్పించారు. ఈనెల 3నుంచి 10 వరకు మొత్తం 34 సెట్ల నామినేషన్లు దాఖలు కాగా చివరి రోజు ఒక్క రోజే 15సెట్ల నామినేషన్లు దాఖలైనట్లు దేవరకొండ తహసీల్దార్ సంతోష్‌కిరణ్ తెలిపారు. 18మంది అభ్యర్థులు ఈ మేరకు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.


మిర్యాలగూడ : నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ అభ్యర్థి సాధినేని శ్రీనివాస్

పట్టణంలో కోలాహలం..

నామినేషన్ దాఖలుకు చివరి రోజు కావడంతో పట్టణంలో కోలాహలం నెలకొంది. కాంగ్రెస్ అభ్యర్థి బాలునాయక్, బీజేపీ అభ్యర్థి లాలునాయక్, బీఎస్పీ అభ్యర్థి వెంకటేష్ చౌహాన్‌లు ఆయా పార్టీల మద్దతుదారులు, పార్టీ శ్రేణులతో కలిసి పట్టణంలో వేర్వేరుగా భారీ ర్యాలీలు నిర్వహించారు. కాగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా దేవరకొండ డీఎస్పీ గిరిబాబు ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.






నిడమనూరు : ఆర్‌ఓకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నిరుద్యోగ యువత ప్రతినిధి గిరిబాబు, బీఎస్పీ అభ్యర్థి వెంకటరమణ, జై మహాభారత్ పార్టీ అభ్యర్థి బి. రుక్మిణినాయక్, స్వతంత్ర అభ్యర్థి

జిల్లా కోసమే నామినేషన్ వేశా : మాజీ ఎమ్మెల్యే

మిర్యాలగూడ టౌన్ : అన్ని అర్హతలు కలిగి మిర్యాలగూడ జిల్లాగా ప్రకటించాలని కోరుతూ శుక్రవారం మిర్యాలగూడ అసెంబ్లీ అభ్యర్థిగా ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేశానని మాజీ ఎమ్మెల్యే రేపాల శ్రీనివాస్ అన్నారు. నామినేషన్ వేసిన అనంతరం మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ తాను ఇప్పటికే మిర్యాలగూడ జిల్లా ప్రకటించేంత వరకు తాను ఉద్యమిస్తానన్నారు. మిర్యాలగూడ జిల్లానే లక్ష్యంగా ముందుకు వెళ్లుతున్నాని అన్నారు. తనను గెలిపిస్తే మిర్యాలగూడ జిల్లాను ఏర్పాటు చేయిస్తానన్నారు.

దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత


భక్తులకు అన్నదానం చేస్తున్న వెంకటేశ్వరరావు

డిండి : దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రాజినేని వెంకటేశ్వరరావు అన్నారు. గ్యార్మీ మాసాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని మహబూబ్‌సుహానీ దర్గాకు ముస్లిం మైనార్టీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఘనంగా గంధోత్సవం కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం స్వామి వారి దర్గాకు దట్టీలు, పూలచాదర్‌లు, మాలీదా సమర్పించి భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ మెంబర్ జహంగీర్, ఆ పార్టీ యూత్ మండలాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్ సాయమ్మ కాశన్న, డిండి పట్టణ అధ్యక్షుడు జి.శ్రీను, శ్రీనివాస్‌గౌడ్,రాములు, బాలయ్య,జంగారెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపించి సోనియా రుణం తీర్చుకోవాలి


నామినేషన్‌కు ఆలస్యం అవుతుండడంతో ఆర్‌ఓ కార్యాలయానికి బైక్‌పై వెళ్తున్న బాలునాయక్

దేవరకొండ : రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకోవాలని మాజీ మంత్రి జానారెడ్డి అన్నారు. శుక్రవారం దేవరకొండలో కాంగ్రెస్ అభ్యర్థి బాలునాయక్ నామినేషన్ సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న జానారెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ కుటుంబపాలనకు చరమగీతం పాడాలన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన కేసీఆర్‌కు ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దేవరకొండలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ఆయన హామీనిచ్చారు. దేవరకొండ కాంగ్రెస్ అభ్యర్థి బాలునాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీలో నేనావత్ బాలునాయక్, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీపీ జాన్‌యాదవ్, దేవేందర్‌నాయక్, నర్సింహ్మా రెడ్డి, దేవేందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సిరాజ్‌ఖాన్, వెంకటయ్య, జూలూరు ధనలక్ష్మీ, శ్రీశైలం యాదవ్, వేణుధర్‌రెడ్డి, యూనుస్ పాల్గొన్నారు.

లింగమ్మకు ప్రముఖుల నివాళి

వేములపల్లి : మండలంలోని శెట్టిపాలెం గ్రామానికి చెందిన మజ్జిగపు లింగమ్మ (80) వృద్ధాప్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్ల మోతు సిద్ధార్థలు శుక్రవారం లింగమ్మ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లింగమ్మ కుటుంబసభ్యులు సర్పంచ్ మజ్జిగపు పద్మ, మజ్జిగపు సుధాకర్‌రెడ్డిలను పరామర్శించారు. వారి వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ కట్టా మల్లేష్‌గౌడ్, నాయకులు గౌరు శ్రీను, కాట్రగడ్డ రాజగోపాల్‌రావు తదితరులు ఉన్నారు.


లింగమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

పేదల అభివృద్ధే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయం

- బీఆర్ఎస్ అభ్యర్థి భాస్కర్‌రావు


మార్నింగ్ వాకర్స్‌తో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి భాస్కర్‌రావు

మిర్యాలగూడ : పేదల అభివృద్ధే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లో నిర్వహించిన ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పట్టణంలోని వార్డుల్లో కోట్లాది రూపాయలను విడుదల చేసి అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, వైస్ చైర్మన్ కుర్ర విష్ణు, బీఆర్ఎస్ యువ నాయకులు సిద్ధార్థ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అన్నభీమోజు నాగార్జునచారి, నాయకులు సుజాత, అమృతందుర్గసత్యం, ఉదయ్‌భాస్కర్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సైదిరెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, రమేష్, రమేష్, రామకృష్ణ, శేఖర్ పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి బీఆర్ఎస్‌ను గెలిపించండి

పట్టణ సమగ్రాభివృద్ధికి తిరిగి ప్రజలు బీఆర్ఎస్‌ను గెలిపించాలని బీఆర్ఎస్ అభ్యర్థి భాస్కర్‌రావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం మార్నింగ్ వాకర్స్‌ను కలిసి మాట్లాడారు. ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకోని పట్టణంలో వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భార్గవ్, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ విష్ణు, నాయకులు ఉదయ్‌భాస్కర్‌గౌడ్, శ్రీనివాస్, సక్రాంనాయక్, కృష్ణకాంత్, సురేష్‌నాయక్, రహమాన్ నాయక్, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ముస్లిం, మైనార్టీల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని బీఆర్ఎస్ యువ నాయకుడు నల్లమోతు సిద్ధార్థ అన్నారు. శుక్రవారం పట్టణంలో ముస్లిం, సోదరులను కలిసి ఆయన ప్రభుత్వ పథకాలను వివరించి మాట్లాడారు. ఎన్నికల్లో ముస్లిం సోదరులు బీఆర్ఎస్‌కు అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఇలియాస్, నాయకులు మాజిద్, జాని, ఫహీమొద్దిన్, ఖలీల్, హబీబ్, గయాస్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక


విద్యార్థి సునీల్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మోదాల రవీందర్

హాలియా : ఈనెల 10, 11, 12వ తేదీల్లో సిద్దిపేట జిల్లాలో నిర్వహించే అండర్–19 విభాగం రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు స్థానిక ఆకాంక్ష హైస్కూల్‌కు చెందిన విద్యార్థి ఆర్ సునిల్ ఎంపికైనట్లు ఆ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు అవుల చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. తమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి ఆర్ సునీల్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎన్నికవ్వడం చాలా గర్వకారణమన్నారు. క్రీడల్లో మంచి ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి క్రీడల్లో రాణించడంతో పాటు పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకరావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థి సునీల్‌ను పాఠశాల కరస్పాండెంట్ మేడేపల్లి మోహన్‌రావు, ప్రిన్సిపాల్ మోదాల రవీందర్, డైరెక్టర్ ఉన్నం శ్రీనుబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

నిరుపేద కుటుంబాలకు బుసిరెడ్డి ఆర్థిక సాయం


తిరుమలగిరి : కొంపల్లిలో ఐటీఐ విద్యార్థికి ఆర్థిక సాయం అందిస్తున్న పాండురంగారెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మండలంలోని కొంపల్లి గ్రామానికి చెందిన ఐటీఐ విద్యార్థి మాతంగి అజయ్‌కి, అదే గ్రామానికి చెందిన బొడ్డపల్లి వెంకటమ్మ, షేక్ లతీఫ్‌బీలు అనారోగ్యంతో బాధపడుతుండగా వారికి బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా పాండురంగారెడ్డి మాట్లాడుతూ నిరుపేదలకు సాయం చేయడంలోనే నిజమైన ఆనందం లభిస్తుందన్నారు. తన ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గం వ్యాప్తంగా ప్రతి కుటుంబానికి ఏదో రకంగా సాయం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యడవల్లి దిలీప్‌రెడ్డి, నెల్లికల్లు సర్పంచ్ పమ్మి జనార్థన్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, రాజయ్య, వెంకటేశ్వర్లు, కరీం, నరేందర్, మోహిన్‌బాషా, బ్రహ్మచారి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

పెద్దవూర : తమకు విద్యాబుద్దులు నేర్పి ప్రయోజకులుగా తీర్చి దిద్దిన తమ గురువు మండలంలోని ఏనేమీదిగూడెం గ్రామానికి చెందిన తాళ్ల వెంకటయ్య ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండటాన్ని తెలుసుకున్న విద్యార్థులు ఆర్థిక సాయం అందజేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని శాంతినికేతన్ గురుకుల పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న గురువు కుమారులకు సిద్ధార్థ విద్యానికేతన్ పాఠశాల పూర్వ విద్యార్థులు తమవంతు సహాయంగా కోమండురి శ్రీరమణ రూ.10వేలు, యాసాల యాదగిరిరావు రూ.5వేలు, ఎర్రెడ్ల కృష్ణారెడ్డి రూ.5వేలు కలిపి మొత్తం రూ.20వేల స్కూల్ ఫీజు చెల్లించి ఆర్థిక సహాయం అందించారు. వీరిని చిన్ననాటి గురువు వెంకటయ్య అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నడ్డి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బాలునాయక్ ఆస్తులు రూ.4.64లక్షలు

- భార్య, కొడుకు పేరుమీద రూ.19.74లక్షలు

దేవరకొండ : ప్రస్తుత దేవరకొండ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నేనావత్ బాలునాయక్ తరపున కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం దేవరకొండ ఆర్‌ఓ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. వారు దాఖలు చేసిన అఫిడవిట్‌లలో భవనాలు, బ్యాంక్ డిపాజిట్స్, భూమి, వాహనాలు, బంగారం, అప్పులను చూపిస్తూ పత్రాలను దాఖలు చేశారు. దీని ప్రకారం ఆయన పేరున మొత్తం ఆస్తులు రూ.4.64,925 ఉండగా ఆయన భార్య పేరిట రూ.12,62,081 ఉన్నట్లు చూపించారు. అయితే పైన తెలిపినవి మొత్తం చరాస్తులుగా చూపించారు. వీరికి స్థిరాస్తులు లేన్నట్లు, అప్పులు కూడా లేనట్లుగా అఫిడవిట్‌లో పేర్కొన్నారు. నేనావత్ బాలునాయక్ కుమారుడు నేనావత్ అభిలాష్ పేరు మీదుగా రూ.7,12,701 ఆస్తులు ఉన్నట్లు, వారి తల్లి గమిని పేరిట రూ.3,19,026 ఆస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం బాలునాయక్ చేతిలో రూ. లక్షనగదు, తన భార్య చేతిలో రూ.50వేల నగదు ఉన్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా గత 2018 ఎన్నికలలో ఆయన వేసిన నామినేషన్ పత్రాలలోని అఫిడవిట్‌లో తన పేరిట రూ.25,30,793, ఆయన సతీమణి పేరిట రూ.4,05,966 చరాస్తులు ఉన్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా స్థిరాస్తులు లేనట్లుగా, తన పేరిట రూ.8,48,308 అప్పులు ఉన్నట్లు గత 2018 ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

దివ్యాంగులకు రాజకీయ డిక్లరేషన్ ప్రకటించాలి


మాట్లాడుతున్న తలారి శంకర్

హాలియా : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ పార్టీలన్ని దివ్యాంగులకు రాజకీయ డిక్లరేషన్ ప్రకటించి ఎన్నికల్లోకి వెళ్లాలని దివ్యాంగుల యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తలారి శంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం హాలియా పట్టణంలో నిర్వహించిన దివ్యాంగుల నియోజకవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 75 ఏళ్ల స్వతంత్ర భారదేశంలో దివ్యాంగులను కేవలం పింఛన్ కే పరిమితం చేసి రాజకీయ పార్టీలు ఓట్లు దండుకుంటున్నాయని విమర్శించారు. రాజకీయ పార్టీలన్నీ దివ్యాంగులను జెండాలు మోయడానికి ఉపయోగించుకుంటున్నారు తప్ప దివ్యాంగులకు రాజకీయ పార్టీలు చేసిందేమి లేదని ఆరోపించారు. దివ్యాంగుల కు రాజకీయ డిక్లరేషన్‌పై రాష్ట్రంలో ఉన్న రాజకీయ పార్టీలు స్పష్టత ఇవ్వకపోవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. దివ్యాంగులను విస్మరించిన పార్టీలను వచ్చే ఎన్నికల్లో ఓడించి సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి బాలకృష్ణ యాదవ్, నియోజకవర్గ అధ్యక్షుడు కృష్ణ, వివిధ మండలాల అధ్యక్షులు ఖాసీం సిద్దావలి, సైదులు, బ్రహ్మం, నాగరాజు, లక్ష్మి, వాలి, ఎల్లమ్మ పాల్గొన్నారు.

పాఠశాలల్లో దీపావళి సంబరాలు


పేరూర్ పాఠశాల్లో దీపావళి వేడుకలు నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

హాలియా : మండలంలోని పేరూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, స్థానిక టైం స్కూల్, కృష్ణవేణి స్కూల్‌లో ముందస్తుగా శుక్రవారం ఆయా పాఠశాల విద్యార్థులు దీపావళి పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పేరూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కొల్లోజు సాయిశ్రీ, ఉపాధ్యాయురాలు బొమ్మరబోయిన స్వర్ణలత మాట్లాడారు.విద్యార్థులు వినూత్న రీతిలో అట్టముక్కలపై ఆంగ్ల భాషలో దీపావళి పండుగ వేడుకల ఆవశ్యతను తెలియజేశారు. అదే విధంగా టైం స్కూల్, కృష్ణవేణి స్కూల్‌లో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించి బాణా సంచా కాల్చి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో టైం స్కూల్ డైరెక్టర్ మందా నరేందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు కత్తి కోటిరెడ్డి, కృష్ణవేణి స్కూల్ డైరెక్టర్ నిమ్మల లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ బీసీలకు అన్యాయం చేసింది'

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గంలో బీసీలు అధికంగా ఉన్నప్పటికీ ఈ టికెట్‌ను కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేసిందని, అందుకే తాను కాంగ్రెస్ పార్టీ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేశానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పగిడి రామలింగయ్య ఆవేదన వ్యక్తం చేశారు. తాను త 45 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలోనే ఉంటున్నానని, కానీ బీసీలకు టికెట్ ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ తీవ్ర అన్యాయం చేయడం బాధగా ఉందన్నారు. కాంగ్రెస్ అధిష్టానం గుర్తించేందుకే తాను కాంగ్రెస్ పార్టీ రెబల్ గా నామినేషన్ వేశానని తెలిపారు.

మద్యం పట్టివేత

మిర్యాలగూడ అర్బన్ : రైల్లో అక్రమంగా మద్యం తరలించేందుకు ప్రయత్నిస్తున్న వారిని రైల్వే పోలీసులు గుర్తించి వారి వద్ద నుంచి మద్యాన్ని స్వాధీనం చేసుకున్న సంఘటన పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. రైల్వే ఎస్ఐలు జీపీ కె.రెడ్డి, సాలకమ్మ వివరాల ప్రకారం.. మిర్యాలగూడ నుంచి నడికుడికి మద్యాన్ని తరలిస్తున్న క్రమంలో గుర్తించామని, ఘటనలో మొత్తం 25 లిక్కర్ ఫుల్‌బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్ట్ చేశామని ఆ మద్యం బాటిళ్లను ఎక్సైజ్ ఎస్ఐ రామకృష్ణకు సరెండర్ చేసినట్లు తెలిపారు.

రవీంద్రకుమార్ ఆస్తులు రూ.2.17కోట్లు

దేవరకొండ : దేవరకొండ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి రమావత్ రవీంద్రకుమార్ నాయక్ ఇప్పటికే తన నామినేషన్ దాఖలు చేశారు. ఆయన అందజేసిన అఫిడవిట్‌లో బ్యాంక్ డిపాజిట్లు, భూమి, వాహనాలు, బంగారం, అప్పులను చూపిస్తూ అఫిడవిట్ అందజేశారు.ఆయన పేరు మీద మొత్తం ఆస్తులు రూ.2.17,83.574 ఉండగా ఆయన సతీమణి పేరిట రూ.6,05,79,870 ఉన్నట్లు చూపించారు. ఇందులో రూ.68,83,574 ఆయన పేరిట,భార్య పేరిట రూ.64,71,363లక్షల చరాస్తులు ఉన్నట్లు ప్రకటించారు. అదేవిధంగా ఆయన పేరున స్థిరాస్తులు రూ.1.49కోట్లు, ఆయన సతీమణి పేరిట రూ.5.41,8507 ఉన్నట్లు అఫిడవిట్‌లో ప్రకటించారు. ప్రస్తుతం రమావత్ రవీంద్రకుమార్ నాయక్ చేతిలో రూ.10వేల నగదు, ఆయన సతీమణి చేతిలో రూ.5వేల నగదు ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా అభ్యర్థి పేరు మీద ప్రస్తుతం రూ.2,12,728, ఆయన సతీమణి పేరిట రూ.5,77,80,339 అప్పులు ఉన్నట్లు ప్రస్తుత అఫిడవిట్‌లో చూపించారు. అదేవిధంగా గత 2018 ఎన్నికలలో ఆయన వేసిన నామినేషన్‌లో ఆయన పేరున రూ.24,90,578, ఆయన సతీమణి పేరు మీద రూ.7,33,99 చరాస్తులు ఉన్నట్లు, అదే విధంగా ఆయన పేరు మీద రూ.55లక్షలు, సతీమణి పేరు మీద రూ.49లక్షల స్థిరాస్తులు ఉన్నట్లు ఆయన చేతిలో నగదు రూ.10వేల, సతీమణి చేతిలో రూ.5వేల నగదు, ఆయన కుమారుడు హిమవంత్‌నాయక్ చేతిలో రూ.1977 నగదు ఉన్నట్లు గత 2018 ఎన్నికలలో తెలియజేశారు.